నీలగిరి నిత్యపద్యం

ఆటవలది

సుత్తి వలెను నిజము , సుతి మెత్తగా నీతి
మహిన మనుషులకును మనసునందు
నీతి,నిజములెల్ల నిన్ను బాధించినా
బ్రతికినంత భవిత భారమేను
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 57 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | ఆగస్టు 25, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## తెలంగాణ ప్రజలను కేంద్రం
# అవమానించింది

**అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం**

**ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి**

**అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన**

**ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి**




హైదరాబాద్, ఆగస్టు 24 :
అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు.

మిగతా 2లో...




## స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**ఏలూరు జిల్లా ముసునూరులో కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి**



**ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు**

**రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు**

**రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్**

**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం**

ఏలూరు ఆగస్టు 24 :
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు మిగతా 2లో...

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**



హైదరాబాద్, ఆగస్టు 24 :
తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి

మిగతా 2లో...

## శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి**

**బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి**

**శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్**

హైదరాబాద్, 24 :
ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానీటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక మిగతా 2లో...



## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**ఏపీలో స్థానిక ఎన్నికలంటూ ప్రచారం.. ఎస్ఈసీ హెచ్చరిక**

**సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఫేక్ అని వెల్లడి**

**అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రజలకు ఎన్నికల సంఘం సూచన**

**100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం**

**కొత్తగా 33.33 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన**

అమరావతి 24 :
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఈ ఫేక్ షెడ్యూల్‌ను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠినమైన సైబర్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని మిగతా 2లో...






## ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ**

**రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం**

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**




హైదరాబాద్, ఆగస్టు 24 :
తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది.
పాలిటెక్నిక్ కళాశాలలను మిగతా 2లో...

## పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం**

**జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**

**(96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**

**తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**

**పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**

**లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

2లో.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.



ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ÷ూఅ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**అమరావతి ఆగస్టు 24 :**
జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళుతున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ



చూపలేదు. చేపట్టిన పనుల్లో కడా నాణ్యత లేదు. కటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కడా దాదాపు తుది దశకు చేరింది. కటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**మొదటిపేజీ తరువాయి**

టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా




అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ అధికారిక చిహ్నాలు, లోగోలను దుర్వినియోగం చేసి కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ నకిలీ షెడ్యూల్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని పునేఠా తెలిపారు. ఈ షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ తమ కార్యాలయానికి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అధికారిక పత్రికా ప్రకటనల ద్వారా లేదా మీడియా సమావేశాల ద్వారా మాత్రమే వెల్లడిస్తామని, ప్రజలు అనధికారిక వార్తలను ఏమాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆగస్టు 19న జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల మరో 23 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. త్వరలోనే అధికారికంగా షెడ్యూల్ విడుదల చేస్తామని, అప్పటివరకు వదంతులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటిపేజీ తరువాయి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.

ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# ఫీజు బకాయిల రగడ..

### హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 24** :ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**


రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

## ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 24**

రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక



ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు.

ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు.మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

## వర్షంతో పంటలకు ఊరట.. రోడ్లపై ఇక్కట్లు



**ఖానాపూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వరకు ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ పంటలు చేతికి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలు అంతరాయం కలిగించాయి. ఎన్టీఆర్ చౌక్, కన్య సత్తన్న షాపింగ్ మాల్ ముందు రోడ్డుపై నీరు నిలవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.రోడ్లను వైడెనింగ్ చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## మండల స్థాయి గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం జరిగింది. నోడల్ అధికారి, ఎంపీడీవో రాధా రాథోడ్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.రెవెన్యూ శాఖకు ఐదు, ఐకేపీకి ఒక దరఖాస్తు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను వెంటనే డిజిటలైజ్ చేసి సంబంధిత శాఖలకు పంపించామని, సమస్యల పరి ష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ సుజాత, అధికారులు పాల్గొన్నారు.

## జనాభా గణనపై మండల సమావేశం నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లా జనాభా గణన పుస్తకం (డీసీహెచ్బీ)పై మండల స్థాయి సమావేశం సోమవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డీసీహెచ్బీకి సంబంధించిన వివరాలు, రికార్డుల సేకరణ, పరిశీలన అంశాలపై చర్చిం చారు. అధి కారులు తమ పరిధిలోని వివరాలను సమగ్రంగా సేకరించి అందించాలని సూచించారు. సమా వేశంలో ఏఎస్ఓ సదాశివ్, గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు



**ఖానాపూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని హెడ్‌మాస్టర్ రాజేష్ ప్రసాద్ సోమవారం ఖానాపూర్ ఎస్ఐ రాహుల్ గైక్వార్డుకు ఫిర్యాదు చేశారు.పాఠశాల ప్రాంగణంలో ఆకతాయిలు, మందుబాబులు చొరబడి గదుల తాళాలు పగులగొట్టడం, ఫ్యాన్లు, కిటికీలు ధ్వంసం చేయడం, మద్యం సేవించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. పాఠశాల భద్రత దృష్ట్యా నిందితులపై చర్యలు తీసుకోవడంతో పాటు రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు.

## విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, మెడికల్ కిట్లు పంపిణీ



**ఖానాపూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మస్కాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా, ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలుగు స్కూల్ అసిస్టెంట్ వెన్నం అంజయ్య తన స్వంత ఖర్చుతో చూచిరాత పుస్తకాలు, పెన్సిళ్లు, మెడికల్ కిట్లను అందించారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ ఈ సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు భాషా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి రోజూ చూచిరాత రాయడం అవసరమని, ఇది వారి విద్యా ప్రమాణాలను పెంచుతుందని ఆయన పేర్కొన్నారు.అంజయ్య చూపిన సామాజిక బాధ్యతను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి అదనపు కలెక్టర్



**పెద్దపల్లి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచ కుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన ఏ. ఫాతిమా డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరగా, పీడీ హౌసింగ్ అధికారికి రాస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలకుర్తి మండలం ఎలుకలపల్లి గేటు గ్రామానికి చెందిన ధర్మపురి శిరీష ఉపాధి కల్పించాలని కోరగా, వారధి అధికారులకు రాస్తూ చర్యలు చేపట్టాలని తెలిపారు.ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన బర్ల బాపు భూమికి పట్టా మం జూరు చేయాలని కోరగా, తహసిల్దార్ విచారణ చేసి రిపోర్టు సమర్పించాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం బండారికుంట గ్రామానికి చెందిన నేరెళ్ల లత వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరగా, గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ నూతన అర్హత మేరకు పెన్షన్ మం జూ రు చేయాలని సూచించారు.కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ బి. ప్రకాష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సర్ ఫేజ్-2 సమీక్ష సమావేశం నిర్వహణ



**రామగుండం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సోమవారం సర్ ఫేజ్-2పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జులు, కార్పొరేటర్లు పాల్గొని ప్రక్రియ, పురోగతి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. సర్ పనులను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నగర పాలక మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

## ఈనెల 27న జరగనున్న టీజీఈజెఏసి సన్నాహక సమావేశాలు




**పెద్దపల్లి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రామగుండం, సుల్తానాబాద్‌లో నిర్వహించిన ఉద్యమ సన్నాహక సమావేశాలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రానున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని సంకల్పించారు.జిల్లా చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ 206 సంఘాలు ఒకే వేదికపైకి రావడం ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమని, పిఆర్సి అమలు, పెండింగ్ డిఏలు విడుదల, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరణ, హెల్త్ కార్డుల అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, జీవో-25 సవరణ, జీవో-190 అమలు వంటి డిమాండ్లు ఉద్యోగుల హక్కులని పేర్కొన్నారు. ఆగస్టు 27న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే మహాధర్నాకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.జిల్లా ప్రధాన కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఇది కొంతమంది నాయకుల ఉద్యమం కాదని, ప్రతి ఉద్యోగి భవిష్యత్తుకు సంబంధించిన ఉద్యమమని, ప్రతి కార్యాలయం, ప్రతి మండలం నుంచి ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అన్నారు. పెండింగ్ డిఏలు, సిపిఎస్ సమస్యలు, హెల్త్ కార్డుల అమలు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వంటి అంశాల పరిష్కారం కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. నాయకులు సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం, సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమాలను కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో రామగుండం, సుల్తానాబాద్, గోదావరిఖని తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచారం కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధన వరకు ఉద్యమం నిరంతరంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, సంఘ ప్రతినిధులు, మహిళా నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

## నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలుగా ప్రకటించాలని డిమాండ్



**గంగాధర, ఆగస్టు 25 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్, ఇస్తారుపల్లి, మంగపేట, చర్లపల్లి గ్రామాలను వెంటనే ముంపు గ్రామాలుగా ప్రకటించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్ కొప్పుల వెంకటేష్ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు.నారాయణపూర్ చెరువు కట్ట ఎత్తు పెంపు, రిజర్వాయర్‌గా మార్పు ప్రక్రియలో సుమారు రూ.23 కోట్ల నిధులు విడుదలైనట్లు తెలిపారు. కట్ట ఎత్తు పెరిగితే చెరువు కింద ఉన్న నాలుగు గ్రామాలకు ముంపు ప్రమాదం మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నీటి ప్రభావంతో కొన్ని ఇళ్ల గోడలు దెబ్బతింటున్నాయని, భవిష్యత్తులో ఇళ్లు, భూములు మునిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. గ్రామస్తులు గత 16 రోజులుగా రిలే నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా గ్రామాలను సందర్శించి పరిస్థితిని పరిశీలించి, వెంటనే ముంపు గ్రామాలుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాలు, ఇళ్లు, భూములు, జీవనాధారాన్ని కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కొప్పుల వెంకటేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముక్కెర గంగరాజు యాదవ్, భూత్కూరి మధు, దుబ్బాక అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ సమస్య పరిష్కారానికి ప్రభుత్వ కృషి చేస్తుంది కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి




**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** 22ఏ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే రెవెన్యూ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష జరిపి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు.ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షాలు ధర్నాలు, ఆందోళనల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం విడ్డూరమని ఆయన విమర్శించారు. కలెక్టర్లకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హత ఉన్నవారికి న్యాయం చేయాలని సూచించారని తెలిపారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారి పక్షాన నిలబడి ఉందని నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో ధరణి వ్యవస్థ కారణంగా భూ సమస్యలు పెరిగాయని, ఇప్పుడు ప్రతిపక్షాలు మొసలి కన్నీరు కారుస్తూ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మకుండా అధికారుల విచారణకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ముక్క భాస్కర్, అస్థాపురం రమేష్, మామిడి సత్యనారాయణరెడ్డి, భారీ బషీర్, మిరాజ్ తోట అంజయ్య, లక్కిరెడ్డి కిరణ్‌రెడ్డి, పెద్దిగారి తిరుపతి, బత్తుల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 22ఏ సమస్యపై గంగుల కమలాకర్ ఆందోళన



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. భూ బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 22ఏ నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 22ఏను రాజకీయ ప్రయోజనాలు, అవినీతికి వేదికగా మార్చిందని ఆరోపించారు. రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో వేలాది ఎకరాల పట్టా భూములు జాబితాలోకి వెళ్లి ప్రజలు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను ఉద్ధృతం చేసి చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, నగర శాఖ అధ్యక్షుడు చల్ల హరి శంకర్, అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరే టర్లు, భూ బాధితులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి, గౌరవెల్లి ప్రాజెక్టుపై మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ



**హుస్నాబాద్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చిగురుమామిడి మండలంలోని నవాబుపేట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యపై వెంటనే స్పందించి అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు.రైతులు సంప్రదాయ పంటలతో పాటు ఆయిల్‌ఫామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, రైతుభరోసా, రుణమాఫీ, రైతు బీమా, పింఛన్లు, రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా లబ్ధిదారులకు చేయూత అందుతున్నట్లు వివరించారు.కొండాపూర్‌లో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు భూసేకరణకు రూ.250 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇందుర్తి గ్రామంలో సుమారు 100 ఎకరాల్లో ఆయిల్‌ఫామ్ సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడం పట్ల మంత్రి వారిని అభినందించారు. ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఓగులాపూర్ గ్రామంలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేస్తామని, ముంపు భూముల్లో పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బోదకాలు బాధితులు సహా అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని స్పష్టం చేశారు.గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతుభరోసా, రుణమాఫీ, రేషన్ కార్డులు, పింఛన్లు వంటి పథకాల ద్వారా లబ్ధిదారులకు సహాయం అందుతోందని మంత్రి వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమాల్లో ఆర్డీవో షర్మిల, డీపీవో జగదీశ్వర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## సారంపల్లి మల్లారెడ్డి మృతి పేదలకు, రైతాంగానికి తీరని లోటు



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సిపిఎం పార్టీ సీనియర్ నేత, రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి (88) మృతి పేద ప్రజలకు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా కరీంనగర్ సిపిఎం జిల్లా కార్యాలయం ఎదుట పార్టీ జెండాను అవనతం చేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.రైతు సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించిన మల్లారెడ్డి, నీటిపారుదల రంగంలో నిపుణుడిగా అనేకమంది నాయకులు, అధికారులు సలహాలు తీసుకున్నారని వాసుదేవరెడ్డి గుర్తుచేశారు. పేద ప్రజల ఇళ్ల స్థలాల పోరాటం, భూ నిర్వాసితుల ఆందోళనలు, ప్రాజెక్టుల సాధనలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు.వరంగల్ జిల్లాలో పుట్టిన మల్లారెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కమ్యూనిస్టు నాయకునిగా నిరాడంబర జీవితం గడిపిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో గిట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, ఉప్పునూటి శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, డి. నరేష్, కొప్పుల శంకర్, గజ్జల శ్రీకాంత్, అరవింద్, సంధ్య, రజిత, ఇసాక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డిగ్రీ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీ కార్యశాల నిర్వహణ



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, శాతవాహన విశ్వవిద్యాలయ సౌజన్యంతో డ్రోన్ టెక్నాలజీపై రెండు రోజుల కార్యశాల ప్రారంభమైంది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యశాలలో రిసోర్స్ పర్సన్ స్క్వాడ్రన్ లీడర్ గగన్ జోత్ సింగ్ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై ప్రాథమిక అవగాహనతో పాటు వ్యవసాయం, రక్షణ, సర్వే, ఫోటోగ్రఫీ వంటి రంగాల్లో వినియోగంపై వివరించనున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అఫ్సరీ ఉస్మాని, శాతవాహన విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ రమాకాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. సురేష్ కుమార్, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి. శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు సురేష్, తిరుపతి, అనితతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# మిలాద్ ఉన్ నబి పండుగ శాంతియుతంగా జరగాలి సీపీ గౌష్ ఆలం



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా నగరంలోని మర్కజీ మిలాద్ కమిటీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ, మదరసా అన్వార్ ఉల్ ఉలూమ్ కమిటీ పెద్దలతో కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని, అవసరమైన భద్రతా ఏర్పాట్లు కల్పిస్తామని తెలిపారు. చివరి రోజు జరిగే జులూస్ కూడా శాంతియుతంగా సాగాలని సూచించారు. సాధారణ షరతులతో కూడిన అనుమతులు ఇస్తున్నామని, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిటీ సభ్యులను కోరారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్ గౌడ్‌తో పాటు మిలాద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామి, ఇతర ఉన్నతాధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.మొత్తం 193 దరఖాస్తులు అందగా, వీటిలో నగరపాలకకు 58, గృహనిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం క్యాంపు కార్యాలయం, సీఎస్ ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు లాగిన్‌లో అప్డేట్ చేయాలని, మేజర్ ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకంతో తల్లిని హత్య చేసిన కుమారులు



**హుస్నాబాద్, ఆగస్టు (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో మూఢనమ్మకంతో వృద్ధురాలైన తల్లిని బావిలో పడేసి హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. సుమారు 80 ఏళ్ల వెంకటమ్మను ఆమె పెద్ద కుమారుడు నూనె సమ్మయ్య, చిన్న కుమారుడు నూనె శ్రీనివాసులు హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. తల్లి తమ ఇంట్లో మృతి చెందితే ఆ ఇంటిని వదిలి వెళ్లాల్సి వస్తుందనే మూఢనమ్మకంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారని దర్యాప్తులో బయటపడింది.వెంకటమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పక్షవాతం కారణంగా మంచానికే పరిమితమై ఉండగా, ఇద్దరు కుమారులు ఆమెను ఇంటి నుంచి తీసుకెళ్లి సమీపంలోని బావిలో పడవేసినట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం ఆమె కనిపించడం లేదని నటిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి వెతికినట్లు తెలిపారు.కేసు దర్యాప్తులో భాగంగా కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, నిందితుల ప్రవర్తన ఆధారంగా హత్య వాస్తవాలు బయటపడ్డాయి. ఈ ఘటనపై నిందితులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సైదాపూర్ పోలీసులు తెలిపారు.

# ఎస్.ఆర్.ఆర్. కళాశాలలో బయోటెక్నాలజీ విభాగంలో విస్తృత ఉపన్యాసం



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల బయోటెక్నాలజీ విభాగంలో ఒకరోజు విస్తృత ఉపన్యాసం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ ఆదేశానుసారం విభాగాధిపతి డాక్టర్ ఆర్. శ్యామల చంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా కాకతీయ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి. కిషోర్ హాజరై "కణ చక్రము మరియు కణ విభజన నియంత్రణ" అంశంపై కీలక ఉపన్యాసం చేశారు.తదనంతరం బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆర్. శ్యామల చంద్ర, వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ పడాల తిరుపతి, కందుకూరి కళాజ్యోతి, ఆసంపల్లి స్వరూప రాణి తదితరులు పాల్గొని డాక్టర్ జి. కిషోర్‌ను ఘనంగా సత్కరించారు.

# కేసీ కెనాల్‌లో ఉరి తాళ్లతో రైతుల ధర్నా



**నందికొట్కూరు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మల్యాల ఎత్తిపోతల నుంచి కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు మెడకు ఉరి తాళ్లు వేసుకొని వినూత్న నిరసన చేపట్టారు.సిపిఐ నాయకులు రఘురామమూర్తి, శ్రీనివాసులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ, శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, హంద్రీ--నీవా ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసినా, ఆ భూములకు నీళ్లు ఇవ్వకపోవడం పాలకుల నిర్లక్ష్యమని విమర్శించారు. ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ పంటలు ఎండిపోతున్నాయని, తుంగభద్ర, శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి కేసీ కెనాల్‌కు వారం రోజులు నీరు వదిలి ఆపేయడం వల్ల రైతులు తీవ్ర నష్టపోతున్నారని తెలిపారు. సాగునీరు, పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు."కెనాల్ నీళ్లు ఇవ్వకపోతే మాకు మరణమే శరణ్యం" అంటూ రైతులు అర్ధనగ్నంగా నిరసన చేపట్టారు. అనంతరం మల్యాల ఎత్తిపోతల ఏఈలకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల పరిధిలోని రైతులు, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే జయసూర్య



**పాములపాడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి -- సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా వేంపెంట గ్రామంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ప్రభుత్వ అధికారులు, నాయకులతో కలిసి ప్రజలకు కరపత్రాలు అందజేస్తూ, రెండేళ్ల పాలనలో అమలు చేసిన కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, పగిడ్యాల మండల కన్వీనర్ పలచాని మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పిఎ రవీంద్ర, సోషల్ మీడియా ప్రతినిధి ప్రవీణ్, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యసాధన దిశగా కృషి చేయాలి ఎస్పీ



**పాణ్యం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ సోమవారం సుగాలిమెట్టలోని కస్తూరిబా గాంధీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి చదువు, భవిష్యత్ లక్ష్యాలపై చర్చించారు. "జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యే ప్రధాన ఆయుధం. క్రమశిక్షణ, సమయపాలనతో చదువుకుంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలి" అని ఎస్పీ సూచించారు.విద్యార్థులు ఎదురయ్యే ఇబ్బందులను విజయానికి మెట్లుగా భావించాలని, ప్రతి ఒక్కరిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉందని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని ప్రోత్సహించారు. చదువుతో పాటు మంచి నడవడి, పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు."మీ భవిష్యత్తును మీరే నిర్మించుకోవాలి. నేడు చేసే కృషి రేపటి విజయానికి పునాది అవుతుంది" అని ఎస్పీ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ నరేంద్ర కుమార్ రెడ్డి, కస్తూరిబా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు న్యాయం చేయాలని డిమాండ్



**నంద్యాల, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ పేదలకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. కొత్తగా తీసుకొచ్చిన వి.బి.జి. రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి, పాత గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న కూలి బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలని, ప్రభుత్వ భూములను పేదలకు పంచి అర్హులైన వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.కరువు పరిస్థితుల్లో పేద కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి, తక్షణమే ఉపాధి పనులు ప్రారంభించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

# అల్లాజీ కుటుంబానికి ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ

**- మైసమ్మ మృతికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ఓదార్పు**



**ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన మాజీ వార్డు సభ్యుడు జంతుక అల్లాజీ మాతృమూర్తి జంతుక మైసమ్మ గుండెపోటుతో ఈనెల 23న మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం జంగారెడ్డిపల్లికి చేరుకుని అల్లాజీ, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మైసమ్మ సమాధి వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించి, ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అల్లాజీతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కేవీఆర్ సేవా దళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, ఖాదర్ ఖాద్రి, ఆదివాసీ రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్, కొండల్ రెడ్డి, దుడ్డు కృష్ణ యాదవ్, దేవరశెట్టి మహేష్, నాజర్ తో పాటు కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో ప్రజావాణికి 40 పిటిషన్లు

**- 23 శాఖల అధికారుల హాజరు.. సమస్యల పరిష్కారానికి చర్యలు**



**ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. నోడల్ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) జైరామ్ విజయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 23 మంది అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలు, ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. మొత్తం 40 పిటిషన్లు అందగా, రెవెన్యూ శాఖకు 15, గృహ నిర్మాణ శాఖకు 16, ఆమనగల్లు మున్సిపాలిటీకి 6, ఆర్టీసీ, ఐసీడీఎస్, గిరిజన సంక్షేమ శాఖలకు ఒక్కో పిటిషన్ చొప్పున అందాయి. ప్రజల నుంచి స్వీకరించిన పిటిషన్లను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జైరామ్ విజయ్ సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఫహీం ఖాద్రి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు బాధ్యతగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు.

# పాఠశాలకు డెస్క్ బెంచీలు, కంప్యూటర్లు, సైకిళ్ల అందజేత



**పెద్దపల్లి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాగినేడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కార్యక్రమం ఘనంగా జరిగింది.బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 20 డ్యూయల్ డెస్క్ బెంచీలు, 40 స్పోర్ట్స్ యూనిఫార్ములు, 40 స్కూల్ బ్యాగులు, 10 సైకిళ్లు, 2 కంప్యూటర్ సిస్టమ్స్, ప్రింటర్ అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలేటి దామోదర్ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ సోమకుమార్ ఆయనను శాలువాతో సన్మానించారు. బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సతీష్‌ను కూడా సన్మానించి అభినందించారు. సర్పంచ్ సోమకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధి కోసం సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయం అని, భవిష్యత్తులో కూడా సహకారం అందించాలని కోరారు. బ్రాహ్మణపల్లి సర్పంచ్ శోభారాణి విజయ్, కుర్మపల్లి సర్పంచ్ లక్ష్మి లింగయ్య విద్యార్థులను అభినందించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ సోనీ విజయ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

# 22ఏ ఎత్తివేయాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలోని రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి, చింతకుంట, మల్కాపూర్ రోడ్ ప్రాంతాల్లో పట్టా భూములను అక్రమంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు.నగర పరిధిలో ప్రజలు కష్టార్జిత డబ్బుతో స్థలాలు కొనుగోలు చేసి, చట్టబద్ధ పత్రాలతో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని, ఇంటి పన్నులు, విద్యుత్, నీటి బిల్లులు చెల్లిస్తున్నారని చెప్పారు. అయితే 22ఏ జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు నిలిచిపోయి, లోన్లు రాక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నివాస గృహాలు ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి 22ఏ జాబితా నుంచి తొలగించాలని, ప్రతి సర్వే నంబర్‌ను పారదర్శకంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనకు ప్రభుత్వం వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో అంకం శివరాణి, శ్రీరాముల రమేష్, రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్, బసవేణి రాజేందర్, నూతి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహితను వేధించిన వ్యక్తి అరెస్ట్



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బొమ్మకల్ డివిజన్ మధురానగర్‌కు చెందిన ఓ వివాహితను బెదిరించి లైంగికంగా వేధించిన సీతారాంపూర్‌కు చెందిన బైక్ మెకానిక్ మెడిదొడ్డి సాయికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.గత ఆరు నెలలుగా పరిచయం పెంచుకున్న సాయికుమార్, బాధితురాలిని బెదిరిస్తూ పలుమార్లు వేధించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో నిందితుడు బాధితురాలిని కలిసిన దృశ్యాలు రికార్డు కావడంతో విషయం బయటపడింది.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, గణేశ్‌నగర్‌లోని అతని బైక్ షాపు వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలిని భరోసా సెంటర్‌కు పంపించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

# జాతీయ రాకెట్‌బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక



**కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ క్యాంపస్‌లో జాతీయ రాకెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అండర్--14 విభాగంలో ఎం. జస్వంత్ రానా, వి. హర్షవర్ధన్ అంతర్జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. త్వరలో తమిళనాడులో జరిగే జాతీయ రాకెట్‌బాల్ పోటీల్లో వీరు తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఎంపికైన వారిని అభినందించారు.

# జిల్లాలో 17.68 లక్షల మొక్కలు నాటాలి కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. ఒక్కో గ్రామపంచాయతీలో వెయ్యి మొక్కలు నాటే లక్ష్యంతో వనమహోత్సవం భాగంగా 17.68 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఇప్పటికే రెండు లక్షల గుంతలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మిగిలిన గుంతలు తవ్వి మొక్కలు నాటి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. మున్సిపాలిటీలు, ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇరిగేషన్ శాఖ ఖాళీ స్థలాల్లోనూ మొక్కలు నాటాలని ఆదేశించారు.వర్షాల కారణంగా దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 780 మంది టీబీ రోగులపై సమీక్ష చేయాలని వైద్యశాఖ అధికారులను సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, డీఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరము పరిష్కరించాలి కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి ప్రజల వినతులను స్వీకరించిన కలెక్టర్, ప్రజావాణిపై నమ్మకంతో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తారని, ప్రతి దరఖాస్తును బాధ్యతగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మొత్తం 90 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ఎస్‌డీసీ సుదర్శన్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
RNI - TELTEL/2023/87644
తెలుగు దినపత్రిక
మంగళవారం,
ఆగస్టు 25, 2026



## ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని బీజేపీ నిరసన



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు చేస్తున్న నిరసన కార్యక్రమానికి సంఘీభావంగా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ ఔట్ గేట్ వద్ద నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేష్, డివిజన్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## కోతుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక ఆపరేషన్



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో సుదీర్ఘకాలంగా ప్రజలను వేధిస్తున్న కోతుల సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం 13వ డివిజన్ మార్కండేయనగర్‌తో పాటు పరిసర కాలనీల్లో ముమ్మర ఆపరేషన్ నిర్వహించి దాదాపు 80 కోతులను పట్టుకుని బోన్లలో బంధించారు. అనంతరం వాటిని సురక్షితంగా అటవీ ప్రాంతానికి తరలించారు. నగరపాలక సంస్థ వెటర్నరీ అధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి మాట్లా డుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కోతు లను పట్టుకుని అటవీ ప్రాంతాలకు తరలిస్తు న్నామని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కార్పొరేషన్ ప్రత్యేక ప్రణాళికతో ముం దుకు వెళ్తోందని తెలిపారు. నగర మేయర్, కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజల ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వార్డు సభలు నిర్వహించాలి సుదర్శన్ రెడ్డి



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి. (అబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితాలను సభల్లో చదివి వినిపించాలని సూచించారు. ఫారం--6, 7, 8 అందుబాటులో ఉంచి అభ్యంతరాలను నమోదు చేయాలని, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని తెలిపారు. పెండింగ్ నోటీసుల జనరేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు ఎ.ఈ.ఆర్.ఓ.ల ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పెండింగ్ లేకుండా ప్రజా సమస్యలు పరిష్కరించాలి




కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నగరపాలక సంస్థ ఆవరణలోని కళాభారతి సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత అధికారులకు అప్పగించారు. టౌన్ ప్లానింగ్ విభాగం 9, రెవెన్యూ 2, ఇంజనీరింగ్ 4, సానిటేషన్ 1, ఇందిరమ్మ 2, బర్త్ ఌ డెత్ 1 చొప్పున మొత్తం 19 దరఖాస్తులు అందాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఆక్రమణల తొలగింపు, అనధికార నిర్మాణాలు, రెవెన్యూ విభాగానికి పన్ను సవరణ, కొత్త ప్రాపర్టీ, ఇందిరమ్మ, పారిశుధ్యం, బర్త్ ఌ డెత్ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు వచ్చాయి. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో పెట్టకుండా వేగంగా పరిష్కరించాలని కమిషనర్లు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఈ లచ్చిరెడ్డి, ఏసీపీ వేణు, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ నగరపాలక సంస్థ 43వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు అందించేందుకు దశలవారీగా అభివృద్ధి పనులు చేపడు తున్నామని తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గ డువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కా ర్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పొన్నం లక్ష్మి మొండయ్య, కార్పొరేటర్లు తోట అనిల్, ఏపిపి చం ద్ర, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కళాకారులు ప్రజా చైతన్యానికి పాటుపడాలి కలవేన శంకర్



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నాయకుల ప్రసంగాలకంటే గాయకుల పాటలు ప్రజలను ఎక్కువగా ఆలోచింపజేస్తాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజానాట్య మండలి రాష్ట్ర నిర్మాణ బాధ్యులు కలవేన శంకర్ అన్నారు. కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రెండు రోజులుగా జరిగిన కళాకారుల శిక్షణా శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఏఐటీయూసీ 105 ఏళ్ల చరిత్రలో కార్మికుల పోరాటాలు, త్యాగాలను పాటల రూపంలో, ఒగ్గు కథల, బుర్రకథల రూపంలో ప్రజలకు వివరించాలని కళాకారులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు కరీంనగర్‌లో జరగనున్న ఏఐటీయూసీ నాలుగవ రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం కార్మిక లోకం కదం తొక్కాలని, మహాసభల సందర్భంగా కళాకారులు తమ సాంస్కృతిక ప్రతిభను ర్యాలీల్లో, సభల్లో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, ఇప్టా జాతీయ కౌన్సిల్ సభ్యుడు కవ్వంపల్లి స్వామి, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు కటికరెడ్డి బుచన్న యాదవ్, టేకుమల్ల సమ్మయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, సిపిఐ జిల్లా నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద హమాలి కార్మికుల భారీ ధర్నా




కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ఆల్ హమాలి ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఉప్పునూటి శ్రీనివాస్, గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ రైస్ మిల్లులు, సీడ్ మిల్లులు, వ్యవసాయ మార్కెట్, ఐకెపి, బేవరేజ్, కిరాణం, కొబ్బరికాయలు, స్టీలు, సిమెంటు రంగాలలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, హెల్త్ కార్డులు జారీ చేసి ఉచిత వైద్య సేవలు అందించాలని, గుర్తింపు కార్డులు ఇచ్చి అసంఘటిత కార్మికులుగా నమోదు చేయాలని కోరారు. 55 ఏళ్లు పైబడిన కార్మికులకు నెలకు కనీసం రూ.6000 పెన్షన్ ఇవ్వాలని, ఇల్లు లేని వారికి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని చేస్తూ ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల బీమా ఇవ్వాలని, 50 కిలోల పైబడిన బస్తాలను నిషేధించాలని, హమాలీలకు ప్రమాద బీమా, ఆరోగ్య భీమా ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఈ ధర్నాలో హమాలి సంఘం అధ్యక్షులు పిల్లి రవి యాదవ్, ఆవుల రాజయ్య, చౌదరి సంపత్, మ్రి పోచయ్య, తిరుపతి, చుక్క కుమార్, చుక్క శ్రీనివాస్, రాజమౌళి, పరశురాములు, కనుకయ్య, రవి, కొమురయ్య, నరసయ్య, గట్టయ్య, ప్రభాకర్ రెడ్డి తోపాటు సుమారు 200 మంది కార్మికులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కరీంనగర్ కలెక్టరేట్ వద్ద గ్రామపంచాయతీ కార్మికుల 48 గంటల దీక్ష ప్రారంభమైంది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గిట్ల ముకుందరెడ్డి దీక్షను ప్రారంభించి మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ ఌ వర్కర్స్ యూనియన్ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ దీక్ష చేపట్టినట్లు తెలిపారు. జీతాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు నేరుగా అకౌంట్లలో జమ చేయాలని, కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదంతో మరణించిన వారికి రూ.20 లక్షల బీమా ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలుగా చెల్లించాలని కోరారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారుల వేధింపులు అరికట్టాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఉప్పునూటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, యూనియన్ ప్రధాన కార్యదర్శి కొప్పుల శంకర్, కమిటీ సభ్యులు కాష్పాక శంకర్, ఎలకపల్లి సారయ్య, దాసరపు వెంకటేష్, రామానుజన్, మేకల కమలాకర్, ప్రేమ్ కుమార్, వడ్లూరి లక్ష్మీనారాయణ, బుడిగే అంజన్న, లచ్చక్క, లత, స్వరూప మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు

# సింగంపల్లిలో పేదల సొంతింటి కల సాకారం

- నాలుగు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి
- అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత గూడు: ఎమ్మెల్యే
- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామంలో నాలుగు కుటుంబాలకు మంజూరైన ఇళ్లను సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. కటికర్ల నిర్మల, కీర్తిశేషులు రవీందర్ కుటుంబం, బండారి స్వప్న--శేఖర్, గండికోట రోజా--సత్యనారాయణ కుటుంబాలకు మంజూరైన ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత గూడు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదల జీవితాల్లో భరోసా నింపడంతో పాటు వారికి శాశ్వత గృహ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సానమోని సత్యం, ఉపసర్పంచ్ రవీంద్ర, ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్, హీరా సింగ్, నాయకులు వెంకట్ రెడ్డి, పర్వతాలు, బండారి సత్తయ్య, చింతకింది కృష్ణయ్య, ఆమనగంటి నర్సింహా, బోడిగల రాంబాబు, ఆమనగంటి నరేందర్, కాటమోని రామకృష్ణ, దేరంగుల రాజు, కొండల్ రెడ్డి, రాఘవేందర్, దేవరశెట్టి మహేష్, నాజర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# సింగంపల్లికి రహదారి.. బస్సు సౌకర్యం కల్పించాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డికి సర్పంచ్ సత్యం వినతి
- 6 కి.మీ. బీటీ రోడ్డు నిర్మిస్తే నాలుగు మండలాలకు ప్రయోజనం



ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామానికి బీటీ రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సనమోని సత్యం సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆకుతోటపల్లి గేట్ నుంచి సింగంపల్లి మీదుగా పోలేపల్లి గేట్ వరకు సుమారు 6 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు లేకపోవడంతో గ్రామ ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ రహదారి నిర్మాణం చేపడితే వెల్దండ, మాడుగుల, చారకొండ, ఆమనగల్లు మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని వివరించారు. అలాగే గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మాల్ నుంచి ఆవురుపల్లి మీదుగా సింగంపల్లి నుంచి ఆమనగల్లు వరకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణం, బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సత్యం విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సానమోని సత్యం, ఉపసర్పంచ్ రవీంద్ర, ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, గ్రామస్తులు బండారి సత్తయ్య, చింతకింది కృష్ణయ్య, ఆమనగంటి నర్సింహా, బోడిగల రాంబాబు, ఆమనగంటి నరేందర్, కాటమోని రామకృష్ణ, దేరంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# 12వ వార్డులో అభివృద్ధి పనులకు ఊపందుకున్న వేగం

- రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం.. పనులను పరిశీలించిన చైర్మన్ పత్య నాయక్



ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ 12వ వార్డులో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ సోమవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, కౌన్సిలర్ నాగిళ్ల జగన్, కోఆప్షన్ సభ్యుడు చుక్క అల్లాజీ గౌడ్, స్థానిక నాయకులు వద్దే రాజు, దేరంగుల వెంకటేష్‌లతో కలిసి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ పత్య నాయక్ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. వినాయక చవితి నాటికి పనులు పూర్తిచేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. రోడ్డు నిర్మాణంతో వార్డు ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురవుతున్న ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో వార్డుల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చైర్మన్ పత్య నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పాతకోట రాజు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి చదువుకు రూ.15 వేల ఆర్థిక సాయం

- నిత్యశ్రీ వార్షిక పాఠశాల ఫీజుకు అండగా నిలిచిన కౌసల్య తారాసింగ్ నాయక్



వెల్దండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రాత్లావత్ లలిత--నిరంజన్ దంపతుల కుమార్తె నిత్యశ్రీ రెండవ తరగతి వార్షిక పాఠశాల ఫీజు కోసం శ్రీమతి నేనావత్ కౌసల్య తారాసింగ్ నాయక్ రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం చిన్నారి నిత్యశ్రీకి పాఠశాల వార్షిక ఫీజు మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల చదువుకు చేయూతనందించడం అభినందనీయమని అన్నారు. ప్రతి చిన్నారి భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది అని, విద్యార్థుల చదువుకు ఇలాంటి సహాయాలు అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. నిత్యశ్రీ విద్యలో మరింతగా రాణించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారి చదువుకు ఆర్థిక సహాయం అందించిన కౌసల్య తారాసింగ్ నాయక్‌కు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు హరిచంద్ నాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, ఉపసర్పంచ్ నరేష్, గ్రామస్తులు తార్య, హర్యా, శంకర్, లచ్చిరాం, భుజంగం, పాండు, ఉపేందర్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు భారీగా మొక్కలు నాటాలి



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కల నాటకం లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు అన్ని జిల్లాల్లో సామూహికంగా భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.వర్షాలు కురుస్తున్న ఈ అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతంలో స్పష్టమైన లక్ష్యాలతో మొక్కలు నాటాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.మొక్కల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని ఆదేశించారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అటవీ ప్రాంతాలు, పట్టణాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీఓ గీత తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



సుల్తానాబాద్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల గ్రామంలో ప్రారంభమైంది.గ్రామ సర్పంచ్ కాంపల్లి సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ప్రజలకు ఈ కార్డుల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జీపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సునీతా సాగర్, సీఏ దీపికతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ల ఎంపిక జిల్లా సంక్షేమ అధికారి

కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అంగన్వాడీ టీచర్ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ఎలాంటి పైరవీలకు ఆస్కారం ఉండబోదని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి తెలిపారు.జిల్లాలోని 60 పోస్టులకు గాను మొత్తం 2,167 దరఖాస్తులు అందాయని, గంగాధర ప్రాజెక్టులో 20 పోస్టులకు 535, హుజురాబాద్‌లో 16 పోస్టులకు 449, కరీంనగర్ రూరల్‌లో 16 పోస్టులకు 574, అర్బన్‌లో 8 పోస్టులకు 609 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు.ఆగస్టు 1 నుండి 15 వరకు ఆన్లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ పూర్తయిందని, త్వరలో ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించి అభ్యర్థులకు తేదీలను తెలియజేస్తామని చెప్పారు. ఇంటర్ మార్కుల మెరిట్, ప్రత్యేక కేటగిరీల మార్కులు (వితంతువులు, అనాథలు, దివ్యాంగులు) మరియు జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే నమ్మి మోసపోవద్దని హెచ్చరిం చారు. ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకమని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పునరుద్ఘాటించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకై బీజేపీ సమరభేరి



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేసింది.హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు సంఘీభావంగా కరీంనగర్ బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద నిరసన దీక్ష నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అని స్పష్టం చేశారు. బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయని, సర్టిఫికెట్లు అందక పరీక్షలకు హాజరుకాలేక మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.12 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్పొరేటర్ కొమురయ్య, మేయర్ కొలగాని శ్రీనివాస్, మహిళా మోర్చా మాజీ అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్‌రెడ్డి, కన్నా కృష్ణ, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్‌రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ ముసుగులో విద్యుత్ చార్జీల దోపిడీపై సిపిఐ నిరసన



నందికొట్కూర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : డిజిటలైజేషన్ ముసుగులో అదనపు విద్యుత్ యూజర్ చార్జీలు వసూలు చేయడం ప్రజలపై ఆర్థిక భారమని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు నిరసన తెలిపారు. నందికొట్కూర్ అగ్రికల్చర్ విద్యుత్ డీఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అనంతరం డీఈ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పాత ఈఆర్ఓ సెంటర్లలోనే విద్యుత్ బిల్లుల చెల్లింపు విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.మీ-సేవా కేంద్రాలు, సచివాలయాల్లో బిల్లులు చెల్లించేందుకు అదనంగా రూ.10 వసూలు చేయడం సామాన్య ప్రజలపై భారమని విమర్శించారు. కరువు ప్రాంతాల్లో ఆరు నెలల విద్యుత్ బిల్లులను రద్దు చేసి, రైతులకు పగటిపూట 9 గంటల నిరంతరాయ విద్యుత్ అందించాలని కోరారు.రైతుల మోటార్లు, బావులకు వాల్టా చట్టంతో సంబంధం లేకుండా కనెక్షన్లు ఇవ్వాలని, అదనపు యూజర్ చార్జీలను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కె. స్వామన్న, కార్మిక సంఘం నాయకులు ఈ. భాస్కర్ గౌడ్, పగిద్యాల మండల కార్యదర్శి గుంపుల త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బిలకల గూడూరు సమీపంలో 114కేజీల గంజాయి స్వాధీనం



గడివేముల, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : గడివేముల మండలంలోని బిలకల గూడూరు గ్రామ సమీపంలో జెఎస్డబ్ల్యు సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు 114.196 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.నంద్యాల, కర్నూలు జిల్లాల్లో నమోదైన 25 కేసులకు సంబంధించిన గంజాయిని డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ పర్యవేక్షణలో స్వాధీనం చేసి, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల సమక్షంలో ధ్వంసం చేశారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ, గంజాయి మరియు నిషేధిత అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత, ప్రజలు ఇలాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.కార్యక్రమంలో నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు విజయ్‌కుమార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ జైకృష్ణయ్య మూర్తి, ఇన్స్పెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

**– శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికిన ఎంపీ మల్లు రవి**



హైదరాబాద్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): విదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకుని సోమవారం తెలంగాణకు తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన మల్లు రవి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

## చంద్రధనలో రేపు మెగా వైద్య, రక్తదాన శిబిరం

**– లయన్ కొత్త శంకరయ్య స్మారకార్థం నిర్వహణ.. ఉచిత వైద్య పరీక్షలు**



ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): లయన్ కొత్త శంకరయ్య స్మారకార్థం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆగస్టు 25న చంద్రధన గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు లయన్ ఎంగలి బాలకృష్ణ తెలిపారు. శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన మందుల పంపిణీతో పాటు దయాబెటిస్, కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. చంద్రధనతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని లయన్స్ క్లబ్ పీఆర్ఓ లయన్ పాషా పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో అనేక ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని, యువత, ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

## ప్రభుత్వ భూమి పరిరక్షణకు గ్రామస్తుల వినతి

**– అడిషనల్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి వినతిపత్రం అందజేత**



ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు సోమవారం అడిషనల్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి సర్వే నంబర్ 304లోని ప్రభుత్వ భూమి విషయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం సర్వే నంబర్ 304లోని భూమి రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి, గ్రామ ఉమ్మడి భూమిగా ఉందని తెలిపారు. అయితే ఈ భూమిని ప్రైవేట్ సంస్థకు మైనింగ్ లీజు కేటాయించే సమయంలో 'ప్రైవేట్ పట్టా భూమి'గా చూపించడంపై తమకు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితా (22-ఏ)లో చేర్చినప్పటికీ మైనింగ్ లీజులో పట్టా భూమిగా చూపించడం ఎలా జరిగిందో విచారణ జరిపించాలని కోరారు. సర్వే నంబర్ 304కు సంబంధించిన పాత రికార్డులు, పహాణీలు, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించి, రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. గ్రామస్తుల వినతిని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి సంబంధిత అధికారులతో విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## మర్రిగూడ ప్రజావాణికి 8 దరఖాస్తులు



మర్రిగూడ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మర్రిగూడ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 8 దరఖాస్తులు వచ్చినట్లు మండల ఎంపీడీవో మున్నయ్య తెలిపారు.వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 2, విద్యుత్ శాఖకు 1, నీటిపారుదల శాఖకు 1, మండల పరిషత్‌కు 3, గృహ నిర్మాణ శాఖకు 1 దరఖాస్తు చొప్పున అందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీవో రవికుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ హామీ ఇచ్చారు.హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షను ప్రణవ్ సందర్శించి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఇచ్చిన ఇళ్ల పట్టాలను న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా పూర్తి చేస్తామని, జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, పట్టణ, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల బండారి శేఖర్ సంతాపం



కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి రైతాంగానికి, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు అని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ తెలిపారు.రైతు సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం కృషి చేసిన మల్లారెడ్డి జిల్లాతో విడిపోని అనుబంధం కలిగి, రైతు ఉద్యమాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని ఆయన పేర్కొన్నారు. భూమి హక్కులు, సాగునీటి వసతి, వ్యవసాయ రుణాలు, విత్తనాల లభ్యత, గిట్టుబాటు ధరల వంటి అంశాలపై నిరంతరం పోరాటాలు నడిపారని గుర్తుచేశారు.మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు, కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఘనంగా చిలుక శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



కొండగట్టు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో ఏఎస్ఐ చిలుక శ్రీనివాస్ 61వ జన్మదిన వేడుకలను తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్యకళ్యాణం చిత్రపటాన్ని బహూకరించారు. కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరూ కలిసి అల్పాహారం స్వీకరించారు.ఈ నెలాఖరులో ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శ్రీనివాస మిత్రులు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాల జీవితం సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పూట్కూరి, నార్ల శ్రీనివాస్, పైడ శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, ఓటకారి శ్రీనివాస్, దొమ్మటి శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, పాక శ్రీనివాస్, చెందనగిరి శ్రీనివాసచారి, నీలి శ్రీనివాస్, మండలోజు శ్రీనివాస్, బెజ్జంకి శ్రీనివాసరావు, వంగల శ్రీనివాస్, కొండూరి సురేష్, బల్ల చిన్న అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 512వ రోజుకు చేరిన లయన్స్ క్లబ్ 'మీల్స్ ఆన్ వీల్స్'

కరీంనగర్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆకలి నివారణ కార్యక్రమం 512వ రోజుకు చేరుకుంది. మధ్యాహ్నం మార్కెట్ వెంకటేశ్వర స్వామి ఆలయం పక్కన నిరుపేదలకు భోజనం అందించారు.ఈ రోజు సేవా కార్యక్రమం ఇంజనీర్ కోల అన్నారెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించబడింది. లయన్స్ క్లబ్ ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించింది.కార్యక్రమంలో గుడ ధర్మరెడ్డి, కడర్ల ప్రభాకర్ పాల్గొని మద్దతు తెలిపారు. ముక్క శరత్ కృష్ణ, మ్యాడం శివకాంత్ పటేల్, బట్టు వినోద్ పటేల్, పెద్ది విద్యాసాగర్, బోడ్ల రవీందర్, చిదుర సురేష్‌తో పాటు సభ్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ ఆకలితో ఉన్నవారికి గౌరవం, కరుణతో సేవ చేయడమే లక్ష్యమని, ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించి మరింత మందికి చేరువవుతామని ప్రతినిధులు తెలిపారు.

## ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే డప్పుల దండోరా మాతంగి అనిల్



గన్నేరువరం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణపై తప్పుడు ఆరోపణలు చేసే వారి ఇళ్ల ముందు డప్పులతో దండోరా మోగిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గన్నేరువరం మండల అధ్యక్షుడు మాతంగి అనిల్ హెచ్చరించారు.మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంబంధం లేని విషయాలను ఎమ్మెల్యేకు ఆపాదిస్తూ నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదని, సోషల్ మీడియా సహా ఏ వేదికలోనైనా ఆరోపణలు చేస్తే వాటిని నిరూపించకుంటే ప్రజల ముందు దోషిగా నిలబెడతామని హెచ్చరించారు. ఆరోపణలు నిరూపించకపోతే బాధ్యుల ఇళ్ల ముందు డప్పుల దండోరాతో పెద్ద ఎత్తున నిరసన చేపడతామని అనిల్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో దళిత నేతలు లింగంపల్లి శ్రీకాంత్, జీవన్, మహంకాళి మల్లయ్య, న్యాత నరేష్, దేశరాజ్ అనిల్, రాపోలు నవీన్, కొంకటి జయప్రకాష్, బుర్ర తిరుపతి, పెంకర్ల ప్రశాంత్, వెదరే తిరుపతి, చంద్రమౌళి, రాపోలు హరీష్, పాకాల పర్శరాములు, శ్రీకాంత్ గౌడ్, మార్గం మల్లేశం, కుమ్మరి ఆనంద్, బుడిగే సాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

RNI - TELTEL/2023/87644
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
మంగళవారం,
ఆగస్టు 25, 2026


# పిజిఆర్ఎస్ ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు ఎస్పీ సునీల్ షోరాణ్



నంద్యాల, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ స్వయంగా ప్రజల సమస్యలను విని మొత్తం 113 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికగా విని, చట్టపరంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలని ఆదేశించారు.ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులో పరిష్కరించి, తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి పంపాలని సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతమైన పరిష్కారం అందించేందుకు పిజిఆర్ఎస్ వేదికను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు.ం

# నూతన హెల్త్ సెంటర్ భవనానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



నందికొట్కూరు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామంలో 15వ ఫైనాన్స్ ద్వారా రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన హెల్త్ సెంటర్ భవనానికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం, ఆరోగ్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. తరిగోపుల గ్రామ అభివృద్ధిలో ఇది మరో ముందడుగు అని, ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జూపాడుబంగ్లా మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# ఇస్కాల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు విడుదల



పాములపాడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పాములపాడు మండలం ఇస్కాల లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి 2,000 ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుబాటు లోకి తీసుకువచ్చారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఈ కార్యక్రమంలో పాల్గొని నీటిని విడుదల చేశారు. రైతులకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.నీరు విడుదల కావడంతో ఇస్కాల గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, నియోజకవర్గంలో సాగునీటి సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో అబ్జర్వర్ వెంకటశివుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు, జలవనరుల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై 25, 26 తేదీల్లో పి. ప్రశాంతి పర్యటన




నంద్యాల, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సార్--2026)లో భాగంగా నంద్యాల జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌గా నియమితులైన ఐఏఎస్ అధికారి పి. ప్రశాంతి ఆగస్టు 25, 26 తేదీలలో పర్యటించనున్నారు.ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి ఆళ్లగడ్డ, శ్రీశైలం, నంద్యాల నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. అనంతరం సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు నంద్యాల ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు.ఆగస్టు 26న ఉదయం 9.30 నుంచి 10.30 వరకు జిల్లాలోని అన్ని ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించి సవరణ ప్రక్రియ పురోగతిని పరిశీలించనున్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థవంతంగా సవరణ పూర్తి చేయాలని అధికారులకు సూచనలు ఇవ్వనున్నారు.

# కుమ్మరి వీధిలో తీవ్ర దుర్గంధం ఎస్డిపిఐ నిరసన



నందికొట్కూరు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని పగిడ్యాల రోడ్, కుమ్మరి వీధి వెనుక ఉన్న డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్డిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ అబ్దుర్రహ్మాన్ తెలిపారు.చెత్త రీసైక్లింగ్ సమయంలో వస్తున్న దుర్గంధం, దోమలు, ఈగలతో చిన్నారులు, వృద్ధులు జ్వరాలు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేసి, డంపింగ్ యార్డ్‌ను జనావాసాలకు దూరంగా తరలించాలా లేదా ఆధునిక పద్ధతిలో శాస్త్రీయంగా చెత్తను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టి, దోమల మందు పిచికారీ చేయించి దుర్గంధం నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్డిపిఐ నాయకులు రఫీ, మౌలాలి, ఆరిఫ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.?

# పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, కేసుల పురోగతిని పరిశీలించిన ఎస్పీ



పాణ్యం, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ సోమవారం పాణ్యం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ ముందుగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను విని, చట్టపరంగా పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులు, రికార్డ్ రూమ్, ప్రాపర్టీ రూమ్‌ను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించి, వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.ప్రాపర్టీ కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగాన్ని పెంచాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌ను విస్తృతంగా నిర్వహించి, నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ సేవలు అందిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి ఎస్పీ సునీల్ షోరాణ్ సూచించారు.

# రవి రాథోడ్‌కు బీజేపీ శ్రేణుల ఘన సన్మానం

**- జన్మదిన వేడుకల్లో ఆత్మీయంగా అభినందించిన నాయకులు, కార్యకర్తలు**



ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ యువమోర్చా కో-కన్వీనర్ నేనావత్ రవి రాథోడ్ జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి రాథోడ్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన రాజకీయ గురువు, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి ఆశీస్సులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా, మరపురాని సందర్భమని రవి రాథోడ్ తెలిపారు. వారి ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన జన్మదినాన్ని ఘనంగా నిర్వహించి ప్రేమాభిమానాలు చూపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్, గోరటి నరసింహ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బోడ నరసింహ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చెక్కల లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నరేష్ చారి, రాష్ట్ర నాయకులు భగీరథ్, కల్వకుర్తి అసెంబ్లీ యువమోర్చా కన్వీనర్ పద్మ అనిల్, వెల్దండ మండల అధ్యక్షుడు అరుణ్, కల్వకుర్తి పట్టణ అధ్యక్షుడు శివాజీ, కడ్తాల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, ఆమనగల్లు మున్సిపాలిటీ యువమోర్చా అధ్యక్షుడు భరత్, లక్ష్మీనరసింహ, సాయి తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల చేయాలి

**- కరువు కాటుకు ఉమ్మడి నల్లగొండ విలవిల..**
**తాగునీటి కోసం తక్షణ చర్యలు అవసరం**
**- ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి: జూలకంటి రంగారెడ్డి**
**- రైతాంగాన్ని కరువు సంక్షోభం నుంచి గట్టెక్కించాలి: తుమ్మల వీరారెడ్డి**




నల్లగొండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎల్‌నినో ప్రభావంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రమవుతున్నాయని, ప్రజలు, పశువులు, రైతాంగం తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. చెరువులు, కుంటలు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, బోర్లు సైతం వట్టిపోతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్ నుంచి సాగర్ ఎడమ కాలువతో పాటు ఎస్-ఎల్‌బీసీకి తక్షణమే నీటిని విడుదల చేసి పరిధిలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండలోని సీపీఐ(ఎం) దొడ్డి కొమరయ్య భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తాయనే ఆశతో రైతులు బోర్ల ఆధారంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు సాగు చేశారని, ప్రస్తుతం నీటి కొరతతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల శ్రమ వృథా కాకుండా ప్రభుత్వం అత్యవసర ప్రణాళికతో ముందుకు రావాలని కోరారు. నాగార్జునసాగర్‌లో గణనీయమైన నీటి నిల్వలు ఉన్నాయని, ఎగువ ప్రాంతాల నుంచి వరద జలాలు వస్తున్న నేపథ్యంలో సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడంలో ప్రభుత్వం చొరవ చూపాలని జూలకంటి అన్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులు ఇప్పటికే నిండిన నేపథ్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో చర్చించి కృష్ణా జలాలను దిగువ ప్రాంతాలకు విడుదల చేసేలా ఒత్తిడి తేవాలని సూచించారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వం, కేంద్ర జల సంఘంపై కూడా రాష్ట్రం తన వాదనను బలంగా వినిపించాలని కోరారు. ప్రాజెక్టులు పూర్తిగా నిండిన తరువాతే నీటిని దిగువకు వదులుతామనే విధానానికి బదులుగా, అందుబాటులోకి వచ్చిన నీటిని దామాషా ప్రాతిపదికన వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణలోని దిగువ ప్రాంతాల అవసరాలు, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కరువు తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పక్షాలను ఏకం చేయాలని జూలకంటి డిమాండ్ చేశారు. కేంద్రం, పొరుగు రాష్ట్రాలపై సామూహిక ఒత్తిడి తీసుకువచ్చి నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఎస్ఎల్‌బీసీకి నీటిని విడుదల చేస్తే నల్లగొండ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ తదితర నియోజకవర్గాల్లో తాగునీటి ఎద్దడి కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు. మార్గమధ్యంలోని చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి లభ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఇదే సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ, వర్షాభావంతో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. పత్తి, మిర్చి తదితర పంటలు ఎండిపోతుంటే ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించకుండా కాలయాపన చేయడం బాధాకరమని విమర్శించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం, కృష్ణా నదీ యాజమాన్య బోర్డుపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

ఎస్ఎల్‌బీసీ ద్వారా కనీసం 50 చెరువులనైనా నింపి తాగునీటి సమస్యను కొంతవరకు అధిగమించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. చెరువులు నిండడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు, పశువులకు తాగునీటితో పాటు రైతులకు సాగునీటి అవసరాలు కూడా తీర్చవచ్చన్నారు. రైతుల ప్రైవేట్ బోర్లు, బావులను స్వాధీనం చేసుకుంటామని నోటీసులు జారీ చేయడం సరికాదని, ముందుగా ఎగువ ప్రాంతాల నుంచి నీరు తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తు వీడి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని, రైతాంగాన్ని పంట నష్టాల నుంచి, ప్రజలను తాగునీటి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు.

విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారీ ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, చినపాక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**- కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్**
**- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**

నల్లగొండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్రంలోని హమాలీల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట హమాలీలు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎండీ సలీం మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఇల్లు లేని హమాలీల కోసం ప్రత్యేక హమాలీ కాలనీలు నిర్మిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీలను అమలు చేస్తూ వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 55 సంవత్సరాలు దాటిన హమాలీలకు నెలకు రూ.6 వేల పెన్షన్ అందించాలని, ఇల్లు లేని ప్రతి హమాలీ కుటుంబానికి ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి 120 గజాల స్థలాన్ని కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదాలకు గురై మరణించిన హమాలీ కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, హమాలీలకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వంటి సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, భోజనశాలలు, విశ్రాంతి గదులు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా హమాలీ సంఘాలు పలు రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపాలని, లేకపోతే సెప్టెంబర్‌లో "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, బీమగాని గణేష్, తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు గుణగంటి రామచంద్రం, చల్లమల్ల జయచంద్ర, సుంకరబోయిన వెంకన్న, రాములు, వీరయ్య, పాలకూరి సైదులు, సల్లా యాదయ్య, జెర్రిపోతుల సైదులు, జల్లెల సుధా కర్‌రెడ్డి, పజ్జూరు యాదగిరి, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో 97తో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను గందరగోళంలోకి నెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**- బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**



దేవరకొండ ఆగష్టు 24.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ): జీవో 97తో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను గందరగోళంలోకి నెట్టిన తుగ్లక్ రేవంత్ రెడ్డి అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ ఆరోపించారు. సోమవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.గత పది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తూ తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై అనేక సందేహాలు నెలకొన్నాయని బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. స్కిల్ యూనివర్సిటీ చట్టంలోని నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను దాని పరిధిలోకి తీసుకురావడం సరికాదని పేర్కొన్నారు.విద్యార్థుల న్యాయమైన పోరాటానికి బిఆర్ఎస్వీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వరకు వారి పక్షాన పోరాడుతామని తెలిపారు. ప్రభుత్వం వెంటనే జీవో 97పై పునరాలోచించి, పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు.

మంగళవారం,
ఆగస్టు 25, 2026

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక



# ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్ తో వ్యక్తి మృతి



నల్లగొండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్ ప్రెస్):నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా దేవరకొండ రోడ్డు నుండి గందంవారి గూడెం వెళ్లే మార్గంలోఫ్లెక్సీ కడుతుండగా విషాద ఘటన చోటుచేసు కుంది. ఫ్లెక్సీ కడుతున్న సమ యంలో విద్యుత్ తీగలకు తగలడంతో రాజు అనే వ్యక్తి విద్యుత్ షాక్ కు గురై అక్కడిక్కడే ఒకరు మృతి చెందారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఫ్లెక్సీని తొలగించి, విద్యుత్ సరఫరాను నిలిపివేశారు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఏఐటీయూసీ పోరాట ఫలితమే ఆటో కార్మికుల డిమాండ్ల పరిష్కారం

**- ప్రభుత్వ హామీలతో ఆటో సమ్మె విరమణ**
**- స్వీట్లు పంచుకుని, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్న డ్రైవర్లు**



కల్వకుర్తి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ చేపట్టిన నిరంతర పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం దిగివచ్చి కీలక డిమాండ్లను అంగీకరించిందని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల పరశురాములు అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు తెలిపారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు స్వీట్లు పంచుకుని, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పులిజాల పరశురాములు మాట్లాడుతూ, రాష్ట్ర రవాణా శాఖ అధికారులతో ఆటో యూనియన్ల ప్రతినిధులు నిర్వహించిన చర్చల్లో కార్మికుల పలు కీలక డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అలాగే ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల వేధింపులపై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చిందని చెప్పారు. ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలను ప్రవేశపెట్టే ప్రతిపాదనను పూర్తిగా విరమించుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారని, దీంతో ఆటో కార్మికుల్లో నెలకొన్న ఆందోళనకు తెరపడిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావాలని, వాటి అమలుపై ఏఐటీయూసీ నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు దేశం సైదులు, రాజేష్, అమీర్, లక్ష్మీకాంత్ రెడ్డి, పరశురామ్ గౌడ్, మర్రిపల్లి శేఖర్, మహేష్, నాగరాజు, యాదగిరి, ఖదీర్, అంజయ్య నాయక్, ఎడ్ల జనార్దన్, శివ, కృష్ణ, మురళి, రవీందర్, చందు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' ప్రత్యేక సమగ్ర సవరణపై బీజేపీ విస్తృత కార్యశాల

**- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన తల్లోజు ఆచారి**



కల్వకుర్తి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "సర్ ప్రత్యేక సమగ్ర సవరణ" కార్యక్రమంపై మండల స్థాయి విస్తృత కార్యశాల సోమవారం కల్వకుర్తిలో నిర్వహించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు "సర్ ప్రత్యేక సమగ్ర సవరణ" కార్యక్రమం ప్రాముఖ్యత, లక్ష్యాలు, అమలు విధానాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, బూత్ స్థాయి నుంచి శక్తి కేంద్రాల వరకు పార్టీ శ్రేణులు సమర్థవంతంగా పనిచేసి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యశాలలో సర్ ప్రత్యేక సమగ్ర సవరణ ఇన్‌చార్జి రాంభూపాల్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు సురేందర్ గౌడ్, ఎన్. శేఖర్ రెడ్డి, రహమతుల్లా, మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మండల ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, అంజన్ రెడ్డి, బాలరాజు గౌడ్, లింగా రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, బి. శంకర్ గౌడ్, సురేష్ గౌడ్, వెంకటేష్, శివతో పాటు వివిధ మోర్చాల నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బీఎల్‌ఏ-2లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో అపరిశుభ్రతపై చైర్‌పర్సన్ ఆగ్రహం

**- విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని ఫిర్యాదు**
**- ఆకస్మిక తనిఖీలో సమస్యలను గుర్తించిన బృంగి రత్నమాల**



కల్వకుర్తి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని జేపీనగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత, మెనూ అమలుపై నేరుగా విద్యార్థినులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆమె వెంటనే సంబంధిత ఉన్నతాధికారి ఆర్‌సీఓకు ఫోన్ ద్వారా సమాచారం అందించి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాల ఆవరణలో చెత్త పేరుకుపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ నిర్లక్ష్యంగా ఉండటాన్ని గమనించిన చైర్‌పర్సన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ స్థానిక కౌన్సిలర్‌కు గానీ, మున్సిపల్ అధికారులకు గానీ సమాచారం ఇవ్వకపోవడంపై పాఠశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం పాఠశాల యాజమాన్యం బాధ్యత అని పేర్కొంటూ, లోపాలను వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ఈ తనిఖీలో మున్సిపల్ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కౌన్సిలర్లు హుమ్లి హన్మ నాయక్, కుడుముల అస్మిత చంద్రకాంత్ రెడ్డి, పడకంటి వెంకటేష్, దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్యశ్రీ విద్యాభ్యాసానికి ఆర్థిక చేయూత

**- రూ.15 వేల వార్షిక ఫీజు అందజేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



వెల్దండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. వెల్దండ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన చిన్నారి నిత్యశ్రీ విద్యాభ్యాసానికి అవసరమైన వార్షిక పాఠశాల ఫీజు రూ.15 వేల మొత్తాన్ని అందజేసి ఆమె చదువుకు అండగా నిలిచారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన నేనావత్ కౌసల్య - తారా సింగ్ నాయక్, రాత్రావత్ లలిత - నిరంజన్ దంపతుల కుమార్తె నిత్యశ్రీ ప్రస్తుతం రెండో తరగతి చదువుతోంది. చిన్నారి విద్యాభ్యాసానికి అవసరమైన వార్షిక ఫీజును గోలి శ్రీనివాస్ రెడ్డి తన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ప్రేరణాత్మకమని పేర్కొన్నారు. విద్య అనేది ప్రతి చిన్నారి జీవితాన్ని తీర్చిదిద్దే బలమైన పునాది అని, ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకి కాకుండా సమాజంలోని దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. నిత్యశ్రీ విద్యలో మరింతగా రాణించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని గోలి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. విద్యార్థులకు అందజేసే ఇలాంటి సహాయాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు. చిన్నారి విద్యకు సహకారం అందించిన గోలి శ్రీనివాస్ రెడ్డికి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద హరిచంద్ నాయక్, మాజీ సర్పంచ్ అంజి నాయక్, ఉపసర్పంచ్ నరేష్, గ్రామస్తులు తార్య, హర్యా, శంకర్, లచ్చిరాం, భుజంగం, పాండు, ఉపేందర్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బాలుర వసతి గృహానికి నూతన భవనం నిర్మించాలి

**- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన ఏబీవీపీ నాయకులు**



వెల్దండ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే నూతన భవనం నిర్మించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏబీవీపీ వెల్దండ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వెల్దండ మండల కన్వీనర్ రేణుకుంట్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రస్తుతం బీసీ బాలుర వసతి గృహం దయనీయ స్థితిలో ఉందని, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సౌకర్యాలతో కూడిన కొత్త వసతి గృహ భవనాన్ని నిర్మించాలని కోరారు. అలాగే వెల్దండ ప్రభుత్వ జూనియర్ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏబీవీపీ వెల్దండ మండల కో-కన్వీనర్ రేణుకుంట్ల శివచరణ్, హరీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శివలింగం, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కరపత్రం విడుదల



మర్రిగూడ, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మర్రిగూడ మండల కేంద్రంలోని రజకుల ఆరాధ్యదైవం శ్రీ మడివాల మాచిదేవుడు--సీతాలమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న నాలుగో వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం దేవాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా గణపతి, శివలింగం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ పగడాల లింగయ్య, వెంకటంపేట బాలయ్య, కొడుకులపల్లి యాదయ్యతో పాటు రజక సంఘం నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 17 దరఖాస్తులు



ఎలిగేడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 17 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఒకటి, గృహజ్యోతికి సంబంధించి 10, పెన్షన్లకు రెండు, జలసిరికి ఒకటి, మిషన్ భగీరథకు ఒకటి, గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులకు ఒకటి, రోడ్డు కల్వర్టుకు సంబంధించి ఒక దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాకన్న, ఏవో ఉమాపతి, విద్యుత్ శాఖ అధికారి సంపత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత, ఏపీఎం గీతతో పాటు మండల స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎలిగేడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎలిగేడు మండల కేంద్రంలోని బ్రహ్మసూత్రం కలిగిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో రెండో శ్రావణ సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సేగ్యామ దయాకరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. శ్రావణ సోమవారం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు.

# పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు



ఎలిగేడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు లాలపల్లి గ్రామ సర్పంచ్ ఏలేటి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక చెత్తకుండీలు, డ్రమ్ములను కొనుగోలు చేసి సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వద్ద చెత్తకుండీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే శుభకార్యాలు జరిగే ప్రాంతాల్లో చెత్తను సేకరించేందుకు డ్రమ్ములను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థులు ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయకుండా, గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో లేదా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో మా త్రమే వేయాలని సూచించారు. గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి గ్రామపంచాయతీకి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కేంద్రంపై అవగాహన



ఎలిగేడు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మహిళలు, బాలికల సంక్షేమం, రక్షణ, సాధికారత కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలు, పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ సూచించారు. ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో సోమవారం స్థానిక సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ అధ్యక్షతన జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దయా అరుణ మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న సేవలు, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు, లేబర్ కార్డు వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో, మహిళలు, పిల్లలు, వృద్ధుల రక్షణకు ఉపయోగపడే 1098, 181, 14567, 155326, 112, 1908 టోల్‌ఫ్రీ నంబర్ల గురించి కూడా అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.అశోక్, ప్రధానోపాధ్యాయులు వేణు, శశికళ, పుష్పలత, అతివ ఎస్జీవో అధ్యక్షురాలు కె.దీప్తి, అంగన్‌వాడీ టీచర్ ఓదేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
మంగళవారం, ఆగస్టు 25, 2026



## డిగ్రీ విద్యార్థులకు ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన




**కల్వకుర్తి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ర్యాగింగ్ అనేది విద్యార్థుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే సామాజిక దురాచారమే కాకుండా చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు చెరుకు మణికంఠ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కల్వకుర్తిలో సోమవారం నిర్వహించిన ర్యాగింగ్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శార్వాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ర్యాగింగ్ వల్ల విద్యార్థులపై పడే మానసిక, సామాజిక ప్రభావాలపై వివరించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్‌లను శారీరకంగా, మానసికంగా వేధించడం, అవమానించడం, బెదిరించడం లేదా మాటల ద్వారా ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలన్నీ ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. ర్యాగింగ్ విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుందని, విద్యా సంస్థల్లో సురక్షితమైన, స్నేహపూర్వకమైన వాతావరణం నెలకొల్పడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాలల్లో పరస్పర గౌరవం, సహకార భావం పెంపొందించే దిశగా అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ర్యాగింగ్ నిర్మూలన కమిటీ కన్వీనర్ డాక్టర్ పాపయ్య యాదవ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, పూర్వ విద్యార్థి అజయ్ కౌండిన్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరి దుర్మరణం

**– మరో వ్యక్తికి తీవ్ర గాయాలు.. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు**



**డిండి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని శ్రీశైలం జాతీయ రహదారి–765పై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. డిండి హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, టీఎస్ 07 జే 9613 నంబర్ గల యూనికార్న్ ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణి స్తున్నారు. ప్రమాద స్థలానికి ముందు వెళ్తున్న రెండు కార్లు నెమ్మదిగా వెళ్తుండటంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి వాటిని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న టీఎస్10 ఎఫ్ఈ 1161 నంబర్ గల ఎంజీ హెక్టర్ కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న చంద్రకళ మరియు పాత్లావత్ నాగరాజు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తి శ్రీకాంత్ తీవ్రంగా గాయ పడగా, వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఎంజీ హెక్టర్ కారు డ్రైవర్‌ను గుర్తించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి దారితీసిన పూర్తి పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు డిండి ఎస్ఐ సీహెచ్. బాలకృష్ణ వెల్లడించారు.

## మూడు ముళ్లకు ముందే మృత్యువు ఒడిలోకి..

**– నిశ్చితార్థం రోజే యువకుడి విషాదాంతం**
**– రోడ్డు ప్రమాదంలో నరేందర్ మృతి.. గ్రామంలో విషాద ఛాయలు**



**కల్వకుర్తి, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిన రోజే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం కల్వకుర్తి మండలంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివాహ నిశ్చితార్థం ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసుల కథనం ప్రకారం కల్వకుర్తి మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన పోతుగంటి నరేందర్ (26) ఉన్నత విద్యను పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్నాడు. ఆదివారం తన వివాహ నిశ్చితార్థ కార్యక్రమం అమ్మాయి ఇంటి వద్ద నిర్వహించగా, కార్యక్రమం అనంతరం మిత్రులతో కలిసి కారులో స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో మండల పరిధిలోని పంజుగుల సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో నరేందర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని కల్వకుర్తిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిశ్చితార్థం జరిగిన రోజే నరేందర్ ప్రాణాలు కోల్పోవడంతో గుండూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. త్వరలో వివాహం చేసుకుని జీవితంలో స్థిరపడ తాడని ఆశించిన కుటుంబ సభ్యుల కలలు ఒక్కసారిగా ఛిద్రమయ్యాయి. చేతికొచ్చిన కుమారుడు ఉద్యోగం సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటాడని భావించిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నరేందర్ తండ్రి పోతుగంటి నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

## మిలాద్–ఉన్–నబీ ఊరేగింపునకు పకడ్బందీ బందోబస్తు

**– శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు**
**– ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ఈ నెల 26న ఆమనగల్లు పట్టణంలో నిర్వహించనున్న ఊరేగింపును ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేస్తోందని ఎస్‌హెచ్‌ఓ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మత సామరస్యం, శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశానికి ముస్లిం మత పెద్దలు, మిలాద్–ఉన్–నబీ నిర్వాహకులు, హిందూ మత పెద్దలు, మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది హాజరయ్యారు. ఈ నెల 26న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న ఊరేగింపులో పోలీస్ శాఖ సూచించిన మార్గాలు, సమయ పాలన, నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌హెచ్‌ఓ సూచించారు. ఊరేగింపు మార్గంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. మత సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని కాపాడుతూ మిలాద్–ఉన్–నబీ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, పుకార్లు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఊరేగింపు సందర్భంగా అవసరమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, ఎస్ఐ సంతోష్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు మొక్తల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, అనూష శ్రీశైలం, ఉపసర్పంచ్ శ్రీనివాస్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు హాజీ పాషా, మత పెద్దలు, మిలాద్–ఉన్–నబీ నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నల్లమలను ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

**– అచ్చంపేటకు మహర్దశ.. బుల్లెట్ రైలు, ఎలివేటెడ్ కారిడార్, నాలుగు లైన్ల రహదారులపై కీలక ప్రకటనలు**
**– రూ.146.71 కోట్ల రహదారి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి**



**అచ్చంపేట, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లమల ప్రాంతాన్ని ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు అచ్చంపేట నియోజకవర్గాన్ని ఆధునిక రవాణా, మౌలిక సదుపాయాలతో ముందంజలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుల్లెట్ రైలు, ఎలివేటెడ్ కారిడార్, నాలుగు లైన్ల రహదారులు, సాగునీటి ప్రాజెక్టులతో నల్లమల ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని పేర్కొన్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలో సుమారు రూ.146.71 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, వెనుకబడిన ప్రాంతంగా పేరొందిన అచ్చంపేటను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రహదారులు, రవాణా వ్యవస్థను విస్తరిస్తున్నామని తెలిపారు. మెరుగైన రోడ్లు ఏర్పడితే విద్య, వైద్యం, వ్యవసాయం, వ్యాపారం, ఉపాధి రంగాలకు కొత్త ఊతం లభిస్తుందని చెప్పారు. శంషాబాద్ సమీపంలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు కోసం సుమారు 500 ఎకరాల భూమిని సిద్ధం చేస్తున్నామని, ఆ మార్గం నల్లమలలోని మన్ననూరు వరకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే నల్లమల ప్రాంతానికి వేగవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 52 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్ సిద్ధమవుతోందని తెలిపారు. ఈ కారిడార్ నిర్మాణంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా పర్యాటక రాకపోకలు మరింత పెరుగుతాయని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గ ప్రజల చిరకాల డిమాండ్ అయిన హాజీపూర్ నుంచి అచ్చంపేట మున్సిపాలిటీ వరకు సుమారు ఆరు కిలోమీటర్ల నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా త్వరలో చేపట్టే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, నల్లమల ప్రాంతాన్ని ప్రత్యేక పర్యాటక జోన్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రకృతి సౌందర్యం, అటవీ సంపద, చారిత్రక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని పర్యాటకాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. పర్యాటక రంగ విస్తరణతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు చిన్న వ్యాపారాలు, హోటళ్లు, రవాణా రంగాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పలు ప్రతిపాదనలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పదర నుంచి ఇప్పలపల్లి వరకు రహదారి విస్తరణ, అచ్చంపేట నుంచి మన్నెవారిపల్లి వరకు ద్విలైన్ల రహదారి, పట్టణంలో రెండు వంతెనల నిర్మాణం వంటి ప్రతిపాదనలపై మంత్రి కోమటిరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రవాణా, సాగునీరు, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. బుల్లెట్ రైలు, ఎలివేటెడ్ కారిడార్, నాలుగు లైన్ల రహదారులు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సోషల్ టీచర్'గా మారిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**– విద్యార్థులకు స్వయంగా పాఠం బోధించిన కలెక్టర్**
**– బల్మూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ**



**బల్మూరు, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సాధారణంగా పాఠశాలలను తనిఖీ చేసే జిల్లా కలెక్టర్ ఈసారి ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు స్వయంగా పాఠం బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సోమవారం బల్మూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. తనిఖీల సందర్భంగా కలెక్టర్ ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించారు. పాఠశాలలో తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఎనిమిదో తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మమేకమయ్యారు. సాంఘిక శాస్త్రం పాఠ్యాంశానికి సంబంధించిన అక్షాంశాలు, రేఖాంశాలు, భూమధ్యరేఖ అంశాలపై విద్యార్థులను ప్రశ్నించి వారి అవగాహనను పరీక్షించారు. విద్యార్థులు ఇచ్చిన సమాధానాలు విన్న అనంతరం బోర్డు వద్దకు వెళ్లి స్వయంగా పాఠం బోధించారు. భూమధ్యరేఖ ప్రాముఖ్యత, అక్షాంశాలు, రేఖాంశాల ఉపయోగాలు, భూమిపై ప్రాంతాలను గుర్తించడంలో వాటి పాత్రను సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. పాఠ్యాంశాలను కేవలం చదివి గుర్తుంచుకోవడం కాకుండా వాటి వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన కలిగేలా బోధన సాగాలని, తరచూ ప్రశ్నలు అడిగి వారి అభ్యసన స్థాయిని అంచనా వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా బోధన ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పాఠ్యాంశాలను దైనందిన జీవితానికి అనుసంధానం చేస్తూ బోధిస్తే విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తరగతి గదిలోకి వచ్చి పాఠం బోధించడంతో విద్యార్థులు ఉత్సాహంగా స్పందించారు. విద్యా ప్రమాణాల పట్ల కలెక్టర్ చూపిన ప్రత్యేక శ్రద్ధ అందరి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రజాక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

**– ప్రతి ఫిర్యాదుదారునికి పరిష్కార వివరాలు తప్పనిసరిగా తెలియజేయాలి: హేమంత్ కేశవ్ పాటిల్**



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 24 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా తెలియజేయాలని సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ బి. చెన్నయ్యతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 42 వినతులు, ఫిర్యాదులు అందగా వాటిని సంబంధిత శాఖలకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రజావాణి, జిల్లా, ఆర్డీవో, మండల స్థాయిల్లో స్వీకరించిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తమ శాఖ పరిధిలోకి రాని సమస్యలను సంబంధిత శాఖలకు వెంటనే బదిలీ చేసి, పరస్పర సమన్వయంతో పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న వినతులను శాఖలవారీగా సమీక్షించి త్వరితగతిన పరిష్కరించాలని, ఆర్థిక అంశాలు, భూకేటాయింపులు తదితర సమస్యలకు సంబంధించి అవసరమైన నివేదికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపాలని తెలిపారు. ఫిర్యాదును స్వీకరించడం వరకు మాత్రమే అధికారుల బాధ్యత పరిమితం కాదని, సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించే వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా స్పందనాత్మకంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ పాండు, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి: జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్

**– స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో గురుకుల విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేత**



**కల్వకుర్తి, ఆగస్టు 24(నీలగిరి ఎక్స్ ప్రెస్):** యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత, స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో, మై భారత్ అందజేసిన స్పోర్ట్స్ కిట్‌ను స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "వికసిత్ భారత్" లక్ష్య సాధనలో యువత కీలకపాత్ర పోషించాలని అన్నారు. విద్య, క్రీడలు, సామాజిక సేవ తదితర అన్ని రంగాల్లో యువత ముందుండి ఆదర్శంగా నిలవాలని సూచించారు. స్వామి వివేకానంద జీవిత చరిత్ర ప్రతి విద్యార్థి చదవాలని, ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని కోరారు. రాబోయే రోజుల్లో యువత కోసం మరిన్ని సేవా, అవగాహన కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంబయ్య మాట్లాడుతూ, సేవా బృందం యువకులు విద్యార్థుల అభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజ సేవ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవా బృందం సభ్యులు సాయి తేజ, గౌతమ్, హర్షిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం, ఆగస్టు 25, 2026
నీలగిరి ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



## దేవకన్యలా మెరిసిన మానస వారణాసి..





టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. 'బ్రీజ్' తాకిడికి రెక్కలు విప్పుకున్న అందం: మానస వారణాసి "బ్రుషెడ్ బై ది బ్రయీజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. సింపుల్ జ్యువెలరీ.. సోయగం డబుల్: ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' హిట్‌తో ఫుల్ జోష్: మోడలింగ్‌లో రాణించిన మానస వారణాసి, నటనలోనూ తన మార్క్ చూపిస్తోంది. సంతోష్ శోభన్ సరసన ఆమె నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ టాక్ తెచ్చుకోవడంతో ఈ భామ ఫుల్ ఖుషీగా ఉంది. ఇక అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమాతో నటిగా మానస తన స్థానాన్ని మరింత బలంగా సుస్థిరం చేసుకుంది. అందం, అభినయంతో పాటు హుందాతనంతో కూడిన సంప్రదాయ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది మానస వారణాసి. ఇక క్యూట్ అండ్ క్లాసీ ఫోజులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ తెలంగాణ బ్యూటీ, రాబోయే రోజుల్లో తెలుగు చిత్రసీమలో మరిన్ని బిగ్ ఆఫర్లతో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్..


### న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం



టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.
వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

## 100 కోట్ల క్లబ్ దిశగా 'ఇరుముడి'

రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, 'ఇరుముడి' సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.



## వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి



సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు. రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే.

## నన్ను హీరోగా వద్దన్నారు..


### అయినా నా డైరెక్టర్ వినలేదు: అర్జున్ దాస్



అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా ఆగస్ట్ 28న సినిమా విడుదల
దక్షిణాదిలో వేగంగా ఎదుగుతున్న నటుడు అర్జున్ దాస్, తన కొత్త సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. అదితి శంకర్‌తో కలిసి ఆయన హీరోగా నటించిన తమిళ రొమాంటిక్ డ్రామా 'ఒన్స్ మోర్'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన అర్జున్ దాస్, దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ తనపై ఉంచిన నమ్మకాన్ని గుర్తుచేసుకున్నాడు. హీరోగా తనను తొలగిస్తే సినిమా నిర్మిస్తామని పలు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చినా, దర్శకుడు మాత్రం తన కోసమే నిలబడ్డారని వెల్లడించాడు.ఈ సందర్భంగా అర్జున్ దాస్ మాట్లాడుతూ, "చాలా కాలం క్రితం దర్శకుడు శ్రీకాంత్ ఈ కథతో నా దగ్గరకు వచ్చాడు. మా కామన్ ఫ్రెండ్, డైరెక్టర్ సూర్య నారాయణ్ మా ఇద్దరినీ పరిచయం చేశారు. శ్రీకాంత్ చెప్పిన లైన్ నాకు చాలా అందంగా అనిపించింది" అని తెలిపాడు. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎదురైన సవాళ్లను దాస్ వివరించాడు."ఈ కథను చాలా నిర్మాణ సంస్థలకు శ్రీకాంత్ వినిపించాడు. కానీ వాళ్లలో చాలామంది 'హీరోని మార్చితే సినిమా చేస్తాం' అని చెప్పారు. కానీ అన్ని నిర్మాణ సంస్థలకూ శ్రీకాంత్ ఒకటే చెప్పాడు.. 'లేదు, నేను ఈ సినిమా అర్జున్ దాస్‌తోనే చేస్తాను' అని అతడు గట్టిగా చెప్పినట్లు" అర్జున్ దాస్ వెల్లడించాడు. ఎంతో కాలం ఎదురుచూసిన తర్వాత, దర్శకుడి ఆలోచనలతో ఏకీభవించిన నిర్మాత యువరాజ్ గణేశన్ ముందుకు రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కిందని వివరించాడు.ఈ 'ఒన్స్ మోర్' చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అర్జున్ దాస్, అదితి శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, మోడల్ సోనా ఓలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనుంది. మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సంచలనం సృష్టించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

## 'శుక్రాచార్యుడి యుద్ధరావం'.. ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి అక్షయ్ ఖన్నా ఫస్ట్ గ్లింప్స్

ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా, పూజ కొల్లూరు దర్శకత్వంలో నిర్మాణం బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ చిత్రాన్ని అందిస్తున్నారు. 'మహాకాళి' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రం నుంచి 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో రాక్షసుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నారు.



తాజాగా విడుదల చేసిన ఈ గ్లింప్స్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. »THE END BEGINS» (అంతం మొదలవుతుంది) అనే ట్యాగ్‌లైన్‌తో, గంభీరమైన వాతావరణంలో అక్షయ్ ఖన్నా లుక్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకుంటున్నాయి. హనుమాన్ ప్రపంచానికి కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంలో అసుర గురువు శుక్రాచార్యుడి పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. ప్రశాంత్ వర్మ మార్క్ విజువల్స్, సౌండ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, కాన్సెప్ట్ అందిస్తూ క్రియేటర్‌గా వ్యవహరించగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియా రెడ్డి, రోహిత్ సరాఫ్, సముద్రఖని, నాజర్, మురళీ శర్మ, రజత్ కపూర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు.

ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'హనుమాన్' విజయం తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.